


కథ

# రేట్లు

చంద్రలత

‘‘రేత్రంతా సందులేదు. దగ్గిందే దగ్గు. ఆ మాన బిడ్డకు ఊపిరి నిలవలా. చేతుల మిందేసుకొని ఉరుకుల పరుగుల మిందొచ్చినావా... ఏవో ఏం జేస్తావో... సారూ... బిడ్డ మందల నీ చేతిల...’’ పెంచలయ్య కంగారు, భయం, ఆందోళన కలగలసిన బొంగురు గొంతుతో అన్నాడు.

అతని భార్య, కొండమ్మ, నోట్లో కొంగు చెక్కుకొని -మరింతగా కళ్ళు విప్పార్చింది. డా॥ ఉదయ్ పరీక్ష చేస్తోన్న తమ బిడ్డ వంకే చూస్తూ. అప్పటికే వారు ఉదయ్ అసిస్టెంట్ డాక్టర్ కిరణ్‌ను కలిసి వచ్చారు.

బిడ్డను పరీక్ష చేస్తూనే మరిన్ని వివరాలు అడిగాడు డా॥ ఉదయ్.

వాళ్ళు సమాధానాలు చెపుతూ డాక్టర్ ఉదయ్ చేతుల్నే చూస్తున్నారు. అవి వారి బిడ్డను తాకి, తడిమి, తట్టి చూస్తున్నాయి. పరీక్ష చేస్తున్నాయి.

‘‘వారవయిన్లా... ఒహటే మయాన జొరం. అబ్బయ్య శోషొచ్చిన తీర్న మంచాన బడున్లా... మూసిన కన్ను తెరిసిందే లేదు సారూ...’’ పెంచలయ్య గబగబ చెబుతూ భార్య వంక చూశాడు. ఇంకేమైనా చెప్పడం మరిచానా అన్నట్లు.

‘‘రొవన్ని పాలన్న గుటుక్కున తాగినోడు కాదు. ఉన్నట్టుండి ఉలిక్కి పడేది. ఆ మానని నలువు సూపు సూసేది-’’ కొండమ్మ గబుక్కున అంది. ఆ మాటలు మాట్లాదకపోతే ఎక్కడ తమ బిడ్డకు ప్రమాదమో అన్నట్లు.

డాక్టరు బిడ్డ కనురెప్పలు లాగి చూశాడు. నోరు తెరిచి అంగిలి దాకా పరీక్షించాడు. గడ్డం పట్టి అటూ ఇటూ తలను తిప్పుతూ ముఖాన్ని పరిశీలించాడు. గవదలు, గొంతు పరీక్షించాడు. ఊపిరితిత్తులు పరీక్షించాడు. గుండె శబ్దాలు విన్నాడు. అరచేతులు చూశాడు. వేళ్ళూ గోళ్ళూ చూశాడు.

కొండమ్మ కళ్ళు భయంతో విచ్చుకుపోయి ఉన్నాయి. 'పెద్ద డాక్టరు నోట్లోంచి ఒక్క చిన్న మాటన్నా రాలేదే... ఆమె ఊపిరి బిగబెట్టా... పెంచలయ్యను మోచేత్తో పొడిచింది. అతను అర్థం అయినట్లు తలాడించాడు.

''ఇదో... ఆ సారు పోటో ఎత్తించిండ్లా... చూడు..'' అప్పటికే డా॥ కిరణ్ తీయించిన ఎక్స్‌రేను ఉదయ్ చేతికి ఇచ్చాడు.

ఉదయ్ మౌనంగా దానిని తీసుకొన్నాడు. కిటికీలో నుంచి పడుతున్న వెలుతురు వైపు ఎత్తి పట్టుకొని – పరీక్షగా చూశాడు. గంభీరంగా తలాడించాడు.

''నర్స్... ఈ పేషెంట్‌ను ఇంటెన్సివ్‌కేర్‌లో ఉంచాలమ్మా...'' అడ్మిషన్ నోట్ రాస్తూ అడిగాడు డాక్టర్, ''బిడ్డ పేరు ?''

''రవణ'' '' ఎంకట రవణ'' – తండ్రి, ఆ తరువాత తల్లి సమాధానం ఇచ్చారు.

''నర్స్... రమణకు ఆక్సిజన్ పెట్టండమ్మా... పెంచలయ్యా... మీరు ఈ మందులు తెచ్చుకోండి-'' డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను వారి ముందుకు నెట్టాడు.

ఆక్సిజన్ అన్న మాట చెవిన బడగానే వారి ముఖాలు మరింత బిగుసుకు పోయాయి.

డాక్టర్ తన స్టెత్‌ను తీసి టేబుల్‌మీద పెడుతూ నింపాదిగా అడిగాడు, ''ఊ... ఇప్పుడు చెప్పండి. రమణకి తట్టు పోసి ఎంతకాలమైంది? డాక్టరు దగ్గరే జబ్బును దాచిపెడదామని అనుకొన్నారా? పోనీండి. కానీ, ఇప్పుడు రమణ పరిస్థితి కొంచెం ప్రమాదంలోనే ఉంది-'' అరక్షణం ఆగి గంభీరంగా అన్నాడు, ''ఇరవై నాలుగు గంటలు గడవాలి-''

అంతే, అప్పటిదాకా పంచప్రాణాలు బిగబెట్టినట్లు నిలబడిన ఆ దంపతులు ఒక్కసారిగా గొల్లుమన్నారు. రమణను మరింత దగ్గరగా హత్తుకొంది కొండమ్మ. తన ఉనికిని ప్రకటించినట్లుగా రమణ కళ్ళు తేలేసి – తలను తల్లి గుండెలకు తాటించాడు ఎగశ్వాసతో.

''మీరు నర్సుతో వెళ్ళండి. నేను వస్తున్నా-'' డాక్టర్ వారిని నర్స్‌తో పంపేలోపలే మరో నర్సు పరిగెత్తుతున్నట్లుగా గదిలోకి దూసుకు వచ్చింది. మరో మూడేళ్ళ బిడ్డతో. ఆమె వెనకే వేగంగా వచ్చాడు... డాక్టర్ కిరణ్.

''సీరియస్ కేస్ సార్... బేబీ వళ్ళంతా నీలంగా అయిపోయింది-''

మరుక్షణంలో, ఆ ఇద్దరు డాక్టర్లు, నర్సులు, పేషెంట్లతో సహా ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నారు. మరో అయిదు నిమిషాల్లో – పిల్లలు కృత్రిమ శ్వాస తీసుకుంటున్నారు. ప్రాణవాయువు వారి దెబ్బతిన్న ఊపిరితిత్తులను నింపే ప్రయత్నం చేస్తోంది. నరాలలోకి ప్రవహిస్తోన్న సెలైన్ వారిని ఉత్తేజితుల్ని చేయాలని చూస్తోంది. ఏ మందులు పనిచేశాయో – పిల్లల ముఖాలు తేటగా విచ్చుకున్నాయి. పిల్లల పరిస్థితి నిలకడకు వచ్చింది. తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

డాక్టర్ ఉదయ్ తన ఛాంబర్‌లోకి తిరిగి వెళ్ళాడు. అతని గది అద్దాలలో నుంచి పిల్లలు కనబడుతున్నారు. రకరకాల వైపుల మధ్య.

ఆ వెనకే, కిరణ్ కేస్ షీట్లు తీసుకొని లోనికి వచ్చాడు.

''డాక్టర్... ఇవి రెండూ టిపికల్ కేసెస్ ఆఫ్ న్యుమోనియా-''

''ఊహు... ఇవి పోస్ట్‌మీజిల్స్ బ్రాంకో న్యుమోనియా-''

''అయితే ?'' కిరణ్ కొంత అనుమానంగా కొంత అయోమయంగా చూశాడు.

''మనం నిరోధించగలిగేది!'' ఉదయ్ ఆగి మళ్ళీ అన్నాడు, ''ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన ''మీజిల్స్ ఇనిషియేటివ్'' కార్యక్రమం ప్రకారం – మన జాతీయ వైద్య ప్రణాళికల్లో మనం అనుసరిస్తోన్న వ్యాధి నిరోధక కార్యక్రమాల ప్రకారం – ఈ పిల్లలకు ఈ పరిస్థితి రాకూడదు. వచ్చిందంటే ఎక్కడో ఏదో గడబిడ జరిగిందనే-''

''ఎలాంటిది ?''

''తెలియదు. కానీ, ఇట్స్ సీరియస్. మన చిన్న ఆసుపత్రిలోనే ఇప్పుడు వచ్చిన ఈ రెండు కేసులతో ఈ రెండు వారాల్లో సుమారు ముప్పై కేసులు అడ్మిట్ అయ్యాయి. ఇక, ఓపిలో రోజుకు పాతిక నుంచి ముప్పై దాకా చూస్తున్నారు. గత మూడు నెలలుగా! కిరణ్, ఒకసారి ఆ కేస్ షీట్లు అన్నీ నా దగ్గరికి తీసుకురండి. నేనో రిపోర్టు తయారు చేయాలి.'' ఉదయ్.

కిరణ్‌కు చేయవలసిన పనులు చెప్పాడు, ''అంతే కాదు, ఊళ్లో ఉన్న ఇతర పిల్లల డాక్టర్లతో మనం మాట్లాడాలి. వెంటనే!''.

''యస్, డాక్టర్!'' కిరణ్ ఆ పనిలో పడ్డాడు.

ఉదయ్ నర్స్‌ను పిలిచి చెప్పాడు. ''రమణ తండ్రిని లోపలికి పంపించమ్మా-''

వచ్చాడు.

అతనిలో ఒక నిశ్చింత.

డాక్టర్ మీద కొండంత కృతజ్ఞత.

అతను కనురెప్ప వాల్చకుండా... ఉదయ్‌నే అభిమానంగా చూస్తూ నిల్చున్నాడు.

మాట నాన్చకుండా ఉదయ్ నేరుగా విషయంలోకి వచ్చాడు.

''ఇంకెవరికైనా తట్టు పోసిందా? మీ ఇంట్లో.. మీ ఊళ్ళో...?''

''పల్లెల్లో పిల్లకాయలకు చెడీబడీ వచ్చున్నా... మా చింతోడు నువ్వొచ్చి చూడు. ఇంటికొక బిడ్డ... ఆ మాన మంచాన బడున్నా..''

''మరి వాళ్ళను డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళలేదా?''

''మా మాల్యాద్రి మన వొచ్చి ఆ మయాన సూది మందేసేటోడె... అయినా ఏం బళ్ళేదని తిరుకునిన్లా సారూ... ఆ మాల్యాద్రిని పిలుచుకోనొచ్చినానని నన్ను తరముకోనిచ్చారు సారూ... రవణ ఆ వంతన గుడ్లు తేలబెట్టే... యా నూకలమ్మ గమనానికి వచ్చిన్లా... ఆ మాన అబ్బయ్యని ఎత్తుకోని ఏకోర్భూము లారీ ఎక్కావో.. నీ కాడకు వొచ్చావో.. ఎట్టనో ఒవట్టవద్దాలే అనుకుంట. రవణకి తట్టు పోసినట్టు బండోడ గమనానికి రానీలా... అమ్మో... ఆ మాన తరుముకొనేటోడు గాదూ... తట్టు ముటెత్తినావా... ఒక్కోని వైణం చెప్పబళ్ళా...''

ఇంతలో కిరణ్ కేస్‌షీట్లతో లోపలికి వచ్చాడు.

పెంచలయ్య నిశ్శబ్దంగా బయటకు వెళ్ళిపోయాడు.



అంతే, అప్పటిదాకా పంచప్రాణాలు బిగబెట్టినట్లు నిలబడిన ఆ దంపతులు ఒక్కసారిగా గొల్లుమన్నారు. రమణను మరింత దగ్గరగా హత్తుకొంది కొండమ్మ. తన ఉనికిని ప్రకటించినట్లుగా రమణ కళ్ళు తేలేసి – తలను తల్లి గుండెలకు తాటించాడు ఎగశ్వాసతో. ''మీరు నర్సుతో వెళ్ళండి. నేను వస్తున్నా-'' డాక్టర్ వారిని నర్స్‌తో పంపేలోపలే మరో నర్సు పరిగెత్తుతున్నట్లుగా గదిలోకి దూసుకు వచ్చింది. మరో మూడేళ్ళ బిడ్డతో. ఆమె వెనకే వేగంగా వచ్చాడు... డాక్టర్ కిరణ్.

ఎవరూ చెప్పకుండానే.

ఉదయ్, కిరణ్ ఒక వైపు పేషెంట్ల వ్యవహారాలు చక్కదిద్దుతూ – వారికి కావలసిన రిపోర్టులు తయారు చేసుకొన్నారు. ఉదయ్ తన టేబుల్‌పైనున్న జిల్లా పటంలో వ్యాధి పీడిత ప్రాంతాలను గుర్తులు పెట్టసాగాడు.

వెంకన్నపాలెం, కొరటూరు, అలగానిపాడు, ఊటుకూరు, మహిమలూరు, చిలకపాడు, పాతలపల్లి, చింతోడు, తెగచర్ల, క్రిష్టంపల్లి, పామర పల్లి, ఇసుకపల్లి – చూస్తుండగానే జిల్లా పటం ఎర్రబడిపోయింది.

ఉదయ్ ముఖం నల్లబడింది. నొసలు ముడి పడ్డాయి. ఏదో అర్థమయినట్లుగా తలాడించాడు. కిరణ్‌తో చర్చించాడు. ఇతర డాక్టర్లతో ఫోన్లలో సంభాషించాడు. సమావేశానికి ఆహ్వానించాడు.

కలెక్టర్ గారికి పూర్తి వివరాలతో ఒక ఉత్తరం రాశాడు.

మరి కొద్ది సేపటిలో –

ఉత్తరం కవర్లో.

ఉదయ్ కార్లో.



''నాకు అనవసరం. అది నా సమస్య కాదు. నేను ఎందుకు సంతకం పెట్టాలి?'' ఒకరు గది బయటకు వెళ్ళిపోయారు. మరోమాట మాట్లాడకుండా వినకుండా. అతని వంకే అందరూ చూశారు నిశ్శబ్దంగా. వెనకే వెళదామా అనుకుంటూ కుర్చీల్లోంచి లేవబోయి, ఒకరిద్దరు విరమించుకొన్నారు. కూర్చున్న చోటే అసహనంగా కదిలారు.

★★★

''హాయ్ ఉదయ్... ఏంటంత అర్జెంట్? తొందరగా రమ్మనమని పిలిచారు. వెళ్ళాలి. పేషెంట్లు వెయిటింగ్–'' ఒకరు ఉదయ్ అడుగు పెట్టీ పెట్టగానే అన్నారు.

ఉదయ్ పలకరింపుగా నవ్వుతూ తలాడించి... చుట్టూ చూశాడు.

అందరూ అక్కడే ఉన్నారు. ఊరిలోని పిల్లల వైద్యులు. సుమారు ముప్పై మంది.

'ఇంకేం? సగం పని అయినట్లే !' ఉదయ్ సంతోష పడ్డాడు.

'అనుకున్న దానికాన్నా మంచి స్పందన' మురిసిపోయాడు కూడా.

''ఇంతకీ లంచ్ ఏ కంపెనీ వాళ్ళు స్పాన్సర్ చేస్తున్నారు?'' ఒక డాక్టర్ ఆరా తీశాడు. ఎవరో ఫక్కుమన్నారు. కొందరు సమాధానం కోసం ఉదయ్ వైపు చూశారు.

ఉదయ్ కొంచెం ఇబ్బందిగా కదిలాడు.

''జస్ట్ పది నిమిషాల పని –'' అదే సమాధానంగా అదే సంజాయిషీగా గొణిగినట్లుగా అన్నాడు. వారిని ఆహ్వానించేటప్పుడు ఉదయ్ విషయం ఏమిటో వారికి చెప్పాడు. వ్యక్తిగతంగా వారందరూ ఉదయ్‌ని ఎంతో ప్రోత్సహించారు. ఉదయ్ ఇంకేం చెప్పబోతున్నాడోనని–అతని వంకే చూస్తున్నారు. కుతూహలంగా.

''ఒక్క నిమిషం'' ఉదయ్ గొంతు సవరించుకున్నాడు. పెదాలు తడి చేసుకొన్నాడు. ''నేను రాసి తీసుకొచ్చాను. చదువుతాను. వినండి. అందరం చర్చిద్దాం. ఆ తరువాత ఏం చేయాలో ఆలోచిద్దాం.''

ఏమంటారోనన్నట్లు ఉదయ్ ఊపిరి బిగబెట్టి అందరి వంకా చూశాడు.

అభ్యంతరం లేదన్నట్లుగా కొందరు భుజాలెగరేశారు. కొందరు పెదవి విరిచారు. మరికొందరు తలాడించారు. ఇంకొందరు చేతులు కట్టుకొని కుర్చీల్లో నిటారుగా కూర్చున్నారు. ఇంకొందరు గడ్డం పైకెత్తి సూటిగా ఉదయ్ వైపు చూశారు.

ఉదయ్ గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు. ఒక చిరునవ్వుతో ధైర్యాన్ని పుంజుకున్నాడు.

''థ్యాంక్ యూ–'' తలవంచి జేబులోంచి కవరు బయటకు తీశాడు. ఇక ఎవరివంకా చూడకుండా బిగ్గరగా చదవడం మొదలు పెట్టాడు.

''గౌరవనీయ కలెక్టర్ గారూ –

నమస్కారం.

ఇది ఏ ఒక్క వైద్యుడు కానీ, ఒక ఆసుపత్రి కానీ, ఒక నర్స్ కానీ, ఒక ఆరోగ్య కార్యకర్త కానీ – చేయవలసినదీ చేయగలిగినదీ కాదు. ప్రయివేటు ప్రభుత్వ తారతమ్యం లేకుండా వైద్యరంగంలోని అందరం సమిష్టిగా చేయవలసింది. అందుకే, మీకు విజ్ఞప్తి చేస్తున్నాము.

ప్రపంచ ఆరోగ్య సంస్థ 'మీజిల్స్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం' గురించి మీకు తెలుసు. WHO, UNICEF లతోపాటు అనేక అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలతో కలిసి మీజిల్స్‌తో పాటు అనేక ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు మన జాతీయ వ్యాధి నిరోధక కార్యక్రమాలు ప్రారంభించాం. ఇది ప్రపంచ వ్యాప్త ఉద్యమం.

అందుకు అవసరమైన వైద్య ప్రణాళికలు రచించాం. మానవ వనరులను కేటాయించాం. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాం. అలాగే, బ్రహ్మాండమైన అంకెలతో ఫలితాలనూ ప్రకటిస్తున్నాం.

అయితే, మన జిల్లా కేంద్రానికి అరగంట ప్రమాణ వ్యవధిలోనే ఉన్న అనేక మండలాలలోని పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. గత మూడు నెలల్లోనే సుమారు ఐదారు వేల మంది తట్టు పేషెంట్లు మా ఆసుపత్రిలోనే నమోదయ్యాయి. జిల్లాలోని డాక్టర్లు అందరి దగ్గర లెక్కలు తీస్తే గానీ, వ్యాధి తీవ్రత , వ్యాప్తి, ప్రభావం – పూర్తిగా తెలియదు. ఇప్పటికీ గ్రామీణులలో ఉన్న మూఢాచారాలు, వారిని వారి ఊరి పొలిమేర దాటనివ్వడం లేదు. అందుచేత, కేవలం డాక్టర్ల వద్దకు వచ్చిన పేషెంట్ల అంకె మాత్రమే 'తుది అంకె' కాబోదు. ఒక మూఢ నమ్మకంతో ముడిపడిన ఈ జబ్బుతో ఒక పేషెంట్ డాక్టర్ వద్దకు వచ్చారంటే – అనేకులు ఇళ్ళల్లో పల్లెల్లో ఉన్నారని మనం అర్థం చేసుకోవాలి.

ఇది అంటువ్యాధి. ఎంత వేగంగా వ్యాధి వృద్ధి చెందుతుందో – అంత వేగంగా వ్యాపిస్తుంది. అంతే వేగంగా ప్రాణాంతకం అవుతుంది.

ఇది పిల్లలకే పరిమితం కాదు. టీకాల రక్షణ లేని వారికి ఎవరికైనా వయోభేదం లేకుండా వ్యాపిస్తుంది. పూర్తి స్థాయిలో తట్టు విజృంభించక మునుపే – ఒక ఎపిడెమిక్‌లా విరుచుకుపడక మునుపే – దీనిని అత్యవసర సమస్యగా గుర్తించి తక్షణ చర్యలు చేపట్టవలసిందిగా – జిల్లా చిన్న పిల్లల వైద్య సంఘం తరపున కోరుతున్నాం.''

''సారీ...''

ఉదయ్ తలెత్తి చూడాలి.

''దీనిని మన సంఘంతో సంప్రదించకుండానే ఎలా రాశావ్?'' ఒకతను అభ్యంతరం లేవదీశాడు.

''అది ప్రభుత్వ వ్యవహారం!'' మరొకరు తేల్చేశారు.

''నాకు అనవసరం. అది నా సమస్య కాదు. నేను ఎందుకు సంతకం పెట్టాలి?'' ఒకరు గది బయటకు వెళ్ళిపోయారు. మరోమాట మాట్లాడకుండా వినకుండా.

అతని వంకే అందరూ చూశారు. నిశ్శబ్దంగా. వెనకే వెళదామా అనుకుంటూ కుర్చీల్లోంచి లేవబోయి, ఒకరిద్దరు విరమించుకొన్నారు. కూర్చున్న చోటే అసహనంగా కదిలారు. గదిలో వాతావరణం హఠాత్తుగా

అప్రసన్నమై పోయింది.

ఉదయ్ ఒక్కసారిగా నిరుత్సాహపడిపోయాడు. మళ్ళీ ధైర్యం పుంజుకొని అన్నాడు.

"విషయం చాలా స్పష్టంగా ఉంది. ఒకటి ఎక్కడో 'కోల్డ్ ఛెయిన్' బ్రేక్ అయి ఉండాలి. రెండోది అసలు ఆ టీకాలు వేయకుండానే వేసేసినట్లు రిపోర్టులు రాసి ఉండాలి. ఎందుకంటే కనీసం నలభై శాతం అన్నా టీకాల రక్షణ లేనప్పుడు మాత్రమే ఇలా ఎపిడెమిక్ బ్రేక్ అవుతుంది – "

"నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా?" ఒక్క ఉదుటున లేచి నిలబడి అడిగాడు డాక్టర్ వివేకానంద–, "నువ్వు ప్రభుత్వ వ్యతిరేక ప్రకటనలు చేస్తున్నావు!"

"కానీ, ఇది నిజం సార్!"

"ఎపిడెమిక్ అని అనౌన్స్ చేయడం అంటే – ఏంటో తెలుసా? పిల్లల డాక్టర్వి. అంత మాత్రాన పిల్లాడిలా మాట్లాడకు! పిల్ల చేష్టలు చేయకు!"

"ఎపిడెమిక్ అని అనౌన్స్ చేయడం అంటే – ప్రభుత్వ వైఫల్యం అని ఒప్పుకోవడం! అంతేనా?" చల్లగా బరువుగా పలికింది డా॥ విజయ్ కుమార్ కంఠం.

గదిలో ఒక్కసారిగా గంభీర వాతావరణం.

"ఈ ప్రయివేటు డాక్టర్లు మాట్లాడారంటే అర్థం ఉంది. కానీ, మీరేంటి సార్...?!?"

"అవును నిజమే, నేను ప్రభుత్వ వైద్యుణ్ణి. ఆ హోదాలో మేము ఓ రిపోర్టు కూడా తయారు చేశాం. కానీ, మా రిపోర్టులు చెత్తబుట్టల్లో తొక్కేశారు. మా నోర్లు నొక్కేశారు. ఇప్పటికి మన జిల్లాలో వేలాది 'తట్టు' కేసులు మా దృష్టికి వచ్చాయి! ఇది ముమ్మాటికీ నిజం! అందుకే, నేను ఉదయ్‌తో ఏకీభవిస్తున్నా. నలభై శాతం కన్నా ఎక్కువ మందికి టీకాల రక్షణ లభించని పక్షంలోనే ఈ వ్యాధి ఇలా విజృంభిస్తుంది. ఆ మాటకు వస్తే, ఏ వ్యాధైనా! ఇది మనకు తెలుసు! తెలియదంటారా?" మనకు అన్న మాటను వత్తి పలికాడు డాక్టర్ విజయ్ కుమార్.

ఉదయ్ కొత్త ఉత్సాహం పుంజుకున్నాడు. హుషారుగా విజయ్‌కుమార్ వైపు చూశాడు. "ఉదయ్..." డాక్టర్ విజయ్ కుమార్ మరింత స్పష్టంగా సూటిగా అడిగాడు, "ఇంతకీ, మీరు ఏం ప్రతిపాదనలు చేయాలనుకొంటున్నారు? విమర్శిస్తే చాలదు. పరిష్కారం సూచించాలి."

"యస్ సార్ !" ఉదయ్ కొండంత ప్రోత్సాహం అందినట్లు పొంగిపోతూ వివరించాడు. "సార్ అది కూడా WHO ప్రతిపాదనే సార్. ఒకటి – క్యాచ్. అప్ – నెలల నుండి పద్నాలుగేళ్ళ వయసున్న పిల్లలందరికీ తట్టు టీకాలు వేయడం. రెండు... కీప్ అప్ – ఇకపై పుట్టబోయే పిల్లలందరిలో సుమారు తొంభై అయిదు శాతం టీకాలు వేయడం. మూడు... ఫాలో అప్ – రెండు మూడేళ్ళకు ఒకసారి జాతీయ స్థాయి టీకాల కార్యక్రమం నిర్వహించడం." ఉదయ్ ఓ క్షణమాగి కొనసాగించాడు – "తొమ్మిది నెలల నుంచి ఏడాదిన్నర దాటిన పిల్లలకు తప్ప తట్టు టీకాలు ఇతర వయస్సుల వారికి వేయడం లేదు కదా సార్ – వేసామంటున్న వారిలో ఎందరికి వేశారో అవీ కాకిలెక్కలే అని తెలుస్తోంది కదా సార్ – లేకపోతే ఇంత మంది 'తట్టు' బారిన పడతారా?"

"పడరు!" డాక్టర్ విజయ్ కుమార్ నవ్వుతూ అన్నాడు, "పడకూడదు!"

డాక్టర్ వివేకానంద అసహనంగా బయటకు వెళ్ళిపోయాడు. అతనితో పాటే నిశ్శబ్దంగా మరొకరిద్దరు. మిగిలిన ప్రభుత్వ వైద్యులు చిన్న నవ్వు నవ్వేసి ఊరుకొన్నారు.

"అయాం సారీ ! నేను మా హాస్పిటల్ యాజమాన్యం వారిని కనుక్కోవాలి" ఒక కార్పొరేట్ ఆసుపత్రి వైద్యుడు వెనక్కి జరిగాడు.

"ఫ్రెండ్... నువ్వింకా ముప్ఫైలలో ఉన్నావు. ఉడుకు రక్తం. అంతే! ఎందుకు చెప్పు ఇవన్నీ? హాయిగా ఇంటికి వెళ్ళి భోంచేసి నిద్రపో! నేనూ వెళుతున్నా–" ఇంకొక సీనియర్ డాక్టర్ ఉదయ్ భుజం తట్టి – బయటకు వెళ్ళిపోయాడు.

"ఉదయ్... నువ్వేం చేస్తున్నావో నీకు అర్థం అవుతుందా? నువ్వు సాటి డాక్టర్ల మీద ఫిర్యాదు చేస్తున్నావు. వారి మీద చర్య తీసుకొంటారు..." ఒకరు చాలా లోతుగా అనునయంగా అన్నారు.

"చర్య తీసుకోవలసి వస్తే – తీసుకొంటారు. అందుకని–?"

"ఫ్రాటర్నెటీ... బ్రదర్... సౌభ్రాతృత్వం !" అతను భుజాలెగరేశాడు.

"ఇంతకీ, ఏ రాజకీయ పక్షం ఉంది నీ వెనుక? " ఇంకొకతను నొసలు చిట్లించాడు.

ఉదయ్‌కి ఇక ఓపిక నశించింది. ఉదయ్ గుండెలోని ఆక్రోశం గొంతులో ఉక్రోశంలా పొడుచుకువచ్చింది. కరుకు చినుకుల్లా తడిగా వాడిగా దూసుకొచ్చాయి మాటలు –

"మీకు తెలుసు. నేను ఏ రాజకీయ పక్షానికి చెందిన వాడిని కాదు. ఒక డాక్టరుగా... ఒక మామూలు మనిషిగా – నేను స్పందించకూడదా?"

"వచ్చు!"

"అక్కడ... పిల్లలు... చ...చ్చి... పోతున్నారు! ఊపిరితిత్తులు గుల్లలయ్యి... మన కళ్ళముందే... మన చేతుల మీదుగా... విలవిలలాడుతూ–" ఉదయ్ గొంతు పూడుకు పోయింది.

"ఏంటయ్యా? మేమంతా ఎలా కనబడుతున్నాం నీ కళ్ళకి? మేమూ మనుషులమే! నిన్నగాక మొన్న స్టెత్ పట్టినవాడివి. మా కళ్ళ ముందు క్లినిక్ తెరిచినవాడివి. నీవు చెప్పడం ఏంటి? మేం వినడం ఏంటి?" వివేకానంద ఎప్పుడు లోపలికి వచ్చాడో కానీ ఉదయ్ మీదకు దూసుకు వచ్చినంత పని చేశాడు.

"సార్... మీరు ఊరుకోండి. సంతకం పెట్టనని చెప్పేవారు కదా. ఇక వదిలేయండి. అతను చేసేది చేయనివ్వండి. ఇలాంటి విజ్ఞాపన పత్రాలు మన సర్వీసులో ఎన్ని చూడలేదు? అతని ఆవేశంగా అణిగేసరికి తలమీద నున్నదంతా అదే దిగుతుంది – మీరెందుకు అనవసరంగా చెడ్డవారు కావడం–" మరొకరు చొరవగా సర్దిచెప్పి వివేకానందను బయటకు తీసుకు వెళ్ళారు.

"అసలే నా పేరు ప్రమోషన్ లిస్ట్‌లో ఉంది. ఎందుకు చెప్పండి నాకే లేనిపోని గొడవ. సారీ–" ఇంకొకతను మౌనంగా బయటపడ్డాడు.

ఉదయ్ నిట్టూర్చాడు. మిగిలిన వారి వంక చూసి, ప్రసన్నంగా నవ్వాడు.

"నాలుగింటికి కలెక్టర్‌గారు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. మీలో ఎవరైనా నాతో వస్తే సంతోషిస్తాను."

అంతా మౌనంగా ఉండిపోయారు.

"థ్యాంక్ యూ –" ఉదయ్ ఒంటరిగానే బయటికి నడిచాడు.

గది గుమ్మం దగ్గర డా॥ విజయ్‌కుమార్ నవ్వుతూ నిలబడి వున్నడు. నెమ్మదిగా అన్నాడు ఉదయ్‌కే వినబడేట్లుగా.

"ఉదయ్, నువ్వు పిలవగానే వీరంతా వచ్చారు. అంటే... ఏమిటీ అర్థం? ఇది ఇప్పుడే మొదలయ్యింది. ఇంతటితో ఇది పూర్తయినట్లుకాదు. మొదట్లో ఎవరికైనా చిన్న చిన్న సందేహాలు, సంకోచాలు, భయాలు, అపోహలు, అపార్థాలు – తలెత్తుతాయి. సహజంగానే. చాలా ప్రయాణించాల్సి వుంది మీరు. ఇంత చిన్న తాకిడికే తట్టుకోకపోతే ఎలా? నిరాశ చెందక మీ ప్రయత్నాన్ని కొనసాగించండి. నమ్మకాన్ని మాత్రం వదలకండి –" డాక్టర్ విజయ్‌కుమార్ ఉదయ్ వెన్నుతట్టి – షేక్ హ్యాండిచ్చాడు.

ఇంతలో – వెనక నుంచి కుర్చీలో బర్రు బర్రున లాగుతూ బిగ్గరగా అరిచారు – ఎవరో –


"కమాన్ ఉదయ్... చేసిన సమాజసేవ చాలు కానీ... మాకో హ్యాం తగ్గింది – వచ్చేయ్!" వారి చేతుల్లోని పేకముక్కలతో వారి నవ్వులూ కలుపుతూ.

ఉదయ్ వెనక్కి తిరగకుండా వెళ్ళిపోయాడు. తిన్నగా తన ఆసుపత్రికి.

★★★

ఉదయ్ ఆసుపత్రి దగ్గరికి వెళ్ళేసరికి, గేటు దగ్గరే పెంచలయ్య ఎదురొచ్చాడు. ఉదయ్ కోసమే ఎదురు చూపులు చూస్తున్నట్లుగా – ఊపిరి ఉగ్గబెట్టి నిల్చున్నాడు. గేటు వారగా.





"మొత్తానికి నీవు భలే వాడివి ఉదయ్, మీ ఊళ్ళో డాక్టర్లు మేం పంపుతోన్న 'తట్టు' పేషెంట్లను గురించి ఏమనుకొంటున్నారో తెలుసా? మూడు నెలలుగా ఆసుపత్రులు కళకళలాడుతున్నాయని. మరి నువ్వు? ఎలా నెగ్గుకొస్తావో... ఏమో...!"

ఉదయ్ కారు గేటు వైపు రాగానే, ఒక అడుగు ముందుకేసి – ఉదయ్ వైపు ఆదుర్దాగా చూశాడు.

పెంచలయ్యను చూడగానే ఉదయ్ మనసులో ఒక ఆలోచన తట్టింది. ' ఇంకా కలెక్టర్ దగ్గరకు వెళ్ళడానికి రెండు గంటల సమయం ఉంది. ఈ లోగా పెంచ లయ్య వాళ్ళ ఊరికి వెళ్ళి వస్తే?'

అంతే, కారుని ఆపకుండా అలాగే వెళ్ళిపో యాడు. సరిగ్గా అరగంటలో దగ్గరలోని ప్రాథమిక చికి త్సాకేంద్రం చేరుకొన్నాడు. ఆ రోజు అక్కడ " ఆపరే షన్ల మేళా" సమయానికి డాక్టర్, మిగిలిన స్టాఫ్ ఆసుప త్రిలోనే ఉన్నారు. అలాగే చుట్టుపక్కల పల్లెల నుంచి వచ్చిన పేషెంట్లు.

పేషెంట్లకు పంపిణీ చేయడానికి దాతలు తెచ్చి పెట్టిన టేబుల్ ఫ్యాన్లు, ఫిల్టర్లు, కుక్కర్లు– ఆసుపత్రి గదిలో పేర్చి ఉన్నాయి. వాటి మధ్యలో ఆకుపచ్చ బట్ట పరిచిన ఇనుప టేబుల్‌కి అవతల డాక్టర్ కృష్ణ. ఉదయ్‌ని నవ్వుతూ ఆహ్వానించాడు.

"హలో ఉదయ్... ఏమిటి ఇలా వచ్చారు?" కృష్ణ షేక్‌హ్యాండ్ ఇచ్చి కుర్చీ చూపించాడు.

"మా పేషెంట్ ఒకరి కోసం. వ్యాక్సినేషన్ వివరాలు కావాలి. లెక్క ప్రకారం అవి మీ వద్ద ఉండాలి."

"ఏ ఊరు ?"

ఉదయ్ చెప్పాడు. దానితోపాటే మిగిలిన వివరాలు.

రికార్డుల్లో ఈ వివరాలు సులువుగానే దొరికాయి. వెంకట రమణకు అన్ని రకాల ప్రభుత్వ టీకాలు వేసేవి ఉన్నాయి.

"కృష్ణా... మీరు ఈ వ్యాక్సినేషన్ రిపోర్ట్ ఇవ్వగలరా?"

"ష్యూర్ !"

డాక్టర్ కృష్ణ వ్యాక్సినేషన్ రిపోర్ట్‌తో పాటు టీ, బిస్కట్లు కూడా ఇచ్చాడు.

"ఈ టీకాలు వేసిన హెల్త్‌వర్కర్‌ని కలవచ్చా?"

"సారీ, ఆమె లీవ్‌లో ఉన్నారు" డాక్టర్ కృష్ణ నిట్టూ ర్చాడు, "మూడొంతులు రెగ్యులర్‌గా వస్తుంటారు. మిగి లిన వాళ్ళం ఏదో నెట్టుకొచ్చేస్తూ వుంటాం. పై నుంచి మాకు టార్గెట్‌లు. ఇదో చూస్తున్నారుగా – టార్గెట్ మేళా – ఇందులో మంచీ చెడూ రెండూ ఉన్నాయి. "

"టీకాలకూ టార్గెట్లా ? "

"తప్పదుగా. అందులోనూ అనేక సాదక బాధ కాలు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లోకి వెళ్ళి నప్పుడు ఇళ్ళల్లో పిల్లలు ఉండాలి. ఉన్న పిల్లలకు టీకాలు వేయా లంటే – వారికి ఏ జ్వరమూ జబ్బు రొప్పురొష్టూ ఉండకూ డదు. ఇక, బూస్టర్ డోస్‌ల నాటికి ఆ పిల్లలను వెతికి పట్టు కోవడమే కష్టం. పై నుంచి, టార్గెట్‌లు, డెడ్‌లైన్లు. వత్తిడి." కృష్ణ ఓ క్షణమాగి కొనసాగించాడు.

"నిజాయితీగా పనిచేసేవారు చేస్తారు. ఎప్పుడైనా ఎక్కడైనా. అలాంటి కొద్ది మంది నిజాయితీ పరుల వలనే ఇంకా నీతి నిలబడి వుంది. కానీ, కాస్త బద్ధకించిన వారు, టార్గెట్ చేరుకోవడమే ముఖ్యమనుకొనేవారు, చేయని పనిని చేసినట్లుగా చూపవచ్చు కదా? ఎవరు అడుగుతారు? పోనీ, ఎవరైనా వెళ్ళి అడిగినా ఆ విద్యా వివరం లేని తల్లిదండ్రులు ఏం చెబుతారు? టీకాలు వేశారా అంటే – వేశారంటారు. ఇన్ని రకాల టీకాలు, బూస్టర్ డోసులు, వాటి ప్రాధాన్యత – వారికి తెలుసా? టార్గెట్‌ల ప్రకారమే మేమూ రిపోర్టులు రాసేసి పైకి పంపేస్తాం – తప్పదు కదా?" 'పైకి' అన్న మాటను అదోలా పలుకుతూ నవ్వాడు కృష్ణ.

ఉదయ్ నవ్వలేక పోయాడు.

ఉదయ్ ముఖం చూసి కృష్ణ కూడా గంభీరంగా అన్నాడు, "ఇది నిజం ఉదయ్ – పై నుంచి కింద వరకూ– అందరికీ తెలుసు. అయినా, పై నుంచే ఏదో రాసి పంపిం చమని సూచనలు వస్తే – ఏం చేయగలం... చెప్పు?"

"పై వాళ్ళు తప్పు చేయమంటే కింద వాళ్ళు చేయ క్కరలేదుగా కృష్ణా, అలాగే కింద వాళ్ళ తప్పులు పై వాళ్ళు కాయక్కర్లేదు. ఇదొక సామాజిక బాధ్యత. ప్రపంచ వ్యాప్త ఉద్యమం. సామాన్యుల ఆరోగ్య రక్షణ కోసం. తెలిసిన వారు తమ సంరక్షణ చూసుకోగలరు. తెలి యని వారికి తెలియచెప్పాల్సినది మనలాంటి వారమే కదా?" ఉదయ్ తేటగా అన్నాడు, "ప్రతి పనిలోనూ సాదక బాధకాలు ఉంటాయి. అది సత్యం. కానీ, అదే సంజాయిషీ అదే సమర్థన కాకూడదు కదా?"

కృష్ణ కళ్ళు విప్పార్చి ఉదయ్ వంకే చూశాడు.

"ఎనీవే, థ్యాంక్ యూ కృష్ణా..." ఉదయ్ బయలు దేరాడు.

"మొత్తానికి నీవు భలే వాడివి ఉదయ్, మీ ఊళ్ళో డాక్టర్లు మేం పంపుతోన్న 'తట్టు' పేషెంట్లను గురించి ఏమనుకొంటున్నారో తెలుసా? మూడు నెలలుగా ఆసు పత్రులు కళకళలాడుతున్నాయని. మరి నువ్వు? ఎలా నెగ్గుకొస్తావో... ఏమో...!" కృష్ణ గుమ్మం దాకా వచ్చాడు ఉదయ్‌ని సాగనంపడానికి.

★★★

ఉదయ్ తన లేఖతో పాటు వెంకటరమణ టీకాల వివరాలు జతపరిచాడు. నేరుగా కలెక్టరాఫీసు దగ్గరకు వెళ్ళాడు. అప్పటికి అతనికి ఇచ్చిన అపాయింట్‌మెంట్‌కి అరగంట వ్యవధి వుంది. ఉదయ్ నిశ్శబ్దంగా బెంచీపైన కూర్చున్నాడు. ఓ చెట్టు కింద. చెట్లూ చేమలు, బంగళా గదులు, పద్ధతులు అన్నీ బ్రిటిష్ యుగం నాటివి లాగానే ఉన్నాయి. చెక్కు చెదరకుండా.

గేటు దగ్గర నుంచి – అర్జీలు విన్నపాలతో ఎందరో నిలబడి వున్నారు. వాళ్ళల్లో ఇంకా అణగారని ఆశని, ఆదుర్దాని, ఆవేదనని చూస్తుంటే – పెంచలయ్యే కళ్ళ ముందు మెదిలాడు. ఎందుకనో.

ఉదయ్ సెల్ ఫోన్ తీశాడు. కిరణ్‌తో వెంకటరమణతో పాటు మిగిలిన పేషెంట్ల గురించీ మాట్లాడాడు. ఫోన్ ఆఫ్ చేయబోతోంటే మెసేజ్. వినీల భోజనానికి రాలేదే మంటూ.

అప్పుడు గుర్తొచ్చింది. భోజనం సంగతి.

ఇంతలో ఉదయ్ పేరు పిలిచారు. ఉదయ్ ఒక్క ఉదుటున వెళ్ళాడు. కానీ, ఉదయ్‌ని వరండా మొదట్లోనే ఆపేశారు.

"మీరు జిల్లా వైద్యాధికారిని కలవండి."

" నేను కలెక్టర్ గారిని కలవడానికి వచ్చాను. కలవమని అపాయింట్‌మెంట్ ఇచ్చారు కదా– "

"సారీ, కలెక్టర్ గారే చెప్పారు. కాసేపటిలో ఎంపిగారు వస్తారు. ఆ తరువాత టివి వాళ్ళు. ఇక మీరు వెళ్ళచ్చు!" పోనీ, నా ఉత్తరం – "

"సారీ... మీరు వెళ్ళచ్చు... డాక్టర్..." డాక్టర్ అన్న పదాన్ని వత్తి పలికాడతను.

ఉదయ్ నిర్ఘాంత పోయినట్లు నిలబడి పోయాడు. నిశ్చేష్టుడై. 'ఒక్క నిమిషమైనా మాట్లాడనివ్వకుండా– ' ఉదయ్ గొంతు పూడుకు పోయింది. 'ఎందుకు అపా

యింట్‌మెంట్ ఇచ్చినట్లు?' అవమానం, బాధ, కోపం లోలోన సుళ్ళు తిరిగింది.

మధ్యాహ్నం సమావేశంలో ఓ ప్రభుత్వ డాక్టర్ మాటలు ఉదయ్ చెవిలో గింగురుమన్నాయి,

''నువ్వేం చేస్తున్నావో తెలుసా? ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నావు. సవాలు చేస్తున్నావు. 'విఫలం చెందారు మీరు' అని వారికి అరిచి చెబుతున్నావు. నీ మాట ఎవరు వింటారు?''

ఉదయ్ ఒక్క క్షణం కళ్ళు మూసుకొన్నాడు. 'అంటే, తను కలవక మునుపే కలెక్టర్ గారికి తన లేఖలోకి విషయం తెలిసిపోయిందా? అయితే, విషయాన్ని దాటవేయడం దేనికి? పరిష్కారమార్గాలు వెతకాలి కానీ!' ఉదయ్ కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు. ఆత్రుతగా ఆశగా వేళ్ళాడుతోన్న ముఖాలు! 'తన పరిస్థితే ఇలా ఉందే... మరి వారి సంగతి?' ఉదయ్ కృత నిశ్చయంతో తలాడించాడు. కొత్త ఉత్సాహంతో జిల్లా వైద్యాధికారి కార్యాలయం వైపు వెళ్ళాడు.

ఒక గంట తరువాత అతని గదిలోకి వెళ్ళగలిగాడు. జిల్లా వైద్యాధికారి ఒంటరిగాలేడు. ఉదయ్ విషయం వివరించాడు. విజ్ఞాపన పత్రం అందించబోయాడు. జిల్లా వైద్యాధికారి మౌనంగానే ఉన్నాడు. అతని పక్కనే ఉన్న వ్యక్తి స్పందించాడు.

''నిన్న కాక మొన్న ఆసుపత్రి తెరిచిన డాక్టర్‌వి - నువ్వు ఒక్కడివి వస్తే - సరిపోతుందా? అయినా, ఎందుకయ్యా ఇవన్నీ నీకు? హాయిగా పేషెంట్లు వస్తుంటే - నాలుగు రాళ్ళు సంపాదించుకోక - దీపం వున్నప్పుడే చక్కదిద్దుకోవాలయ్యా-''

ఆ గదిలో ఉన్న వారందరూ నవ్వారు.

''సార్... అతని విజ్ఞాపన పత్రం తీసుకోవడంలో మీకు అభ్యంతరమేమీ ఉండదనుకొంటా'' గంభీరంగా పలికిందో కంఠం.

ఉదయ్ గిర్రున వెనక్కి తిరిగి చూశాడు. డాక్టర్ విజయ్ కుమార్. నవ్వుతూ నిలబడివున్నాడు.

''సరే, వ్యాక్సినేషన్ ఇన్‌ఛార్జికి ఇచ్చేసి వెళ్ళమను - '' జిల్లా వైద్యాధికారి మాట్లాడాడు ఎట్టకేలకు.

''సార్, నేను చెప్పేది మీరూ ఒకసారి వినండి - ప్లీజ్ -''

''మీరు అన్నీ మీ లెటర్‌లో రాశారు కదా-తప్పకుండా చూస్తాను. ఐయాం సారీ - డాక్టర్ - ప్రాపర్ ఛానల్ ద్వారా అప్రోచ్ అవ్వండి. అదీ కాక, మీకు ముందుగా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోయినా ఇంత సేపు మాట్లాడా-'' జిల్లా వైద్యాధికారి ముక్తాయించాడు.

''సార్... ఈ వెంకటరమణ ఇప్పుడు నా దగ్గర అడ్మిషన్‌లో ఉన్నాడు సార్. మీరు వచ్చి చూడండి సార్ - తెలుస్తుంది. ఒకళ్ళా ఇద్దరా - ఈ మూడు నెలల్లో ఐదారు వేల మందిని... నేను ఒక్కణ్ణే...''

''చూశావా? గుడ్ ! యంగ్ మాన్... బాగానే కూడబెట్టినట్టున్నావే! కీపిటప్!'' అందరూ నవ్వుతూ అక్కడ నుంచి వెళ్ళిపోయారు. అటెండర్‌తో సహా.

ఉదయ్ నిశ్శబ్దంగా నిలబడిపోయాడు.

డాక్టర్ విజయ్‌కుమార్ ఉదయ్ దగ్గరగా వచ్చాడు. మార్దవంగా అన్నాడు. ''టేకిట్ ఈజీ... మై బోయ్!''

''ఎలా? అక్కడ ఎపిడెమిక్ బ్రేక్ అయ్యింది. ఎవరికి వారు ఇలా ప్రవర్తిస్తున్నారు. అక్కడ... పిల్లలు... '' ఉదయ్ గొంతు పెగలలేదు.

''వీళ్ళు ఎన్ని ఎపిడెమిక్‌లను వెలుగులోకి రానివ్వలేదో- ఎన్నిటిని అణిచిపెట్టారో.. నీకీపాటికి అర్థమై ఉంటుంది. వాళ్ళు ఎపిడెమిక్‌లను సృష్టించగలరు కూడా - అవసరం అనుకుంటే ! వాళ్ళకి నిజం తెలుసు. నీ నిజాయితీ తెలుసు. నిన్నెలా బాధపెట్టాలో తెలుసు. ఎలా అణిచిపెట్టాలో కూడా తెలుసు.'' డాక్టర్ విజయ్ కుమార్ బరువుగా అన్నాడు, '' నిలబడి... కళ్ళు తెరిచి... నిద్ర పోతున్న తెల్ల ఏనుగును తట్టి లేపడం - అంత సులభమా? కానీ, ఎవరో ఒకరు తట్టి లేపాలి. ఈ ప్రయత్నం వృధా ప్రయాస కాకూడదు. నీవు ఒంటరివాడివి కాదు. అది గుర్తు పెట్టుకో-''

★★★

ఉదయ్ తన ఆసుపత్రికి ఎలా తిరిగివచ్చాడో తెలియనే లేదు. వచ్చినవాడు వచ్చినట్లే కారులోనే కూర్చుండి పోయాడు. స్టీరింగ్‌తో తల ఆన్చి

'ఒక్క రోజులో ఎన్ని రకాల మనుషులను చూసి వచ్చాడు! జరుగుతున్నదేమిటో అందరికీ తెలుసు. దాని మూలం దాని పర్యవసానం కూడా తెలుసు. జరగవలసిందేమిటో కూడా తెలుసు. కానీ, అందరం కలిసి... చివరికి ఏం చేస్తున్నాం? మనిషితనాన్నే మాయం చేస్తున్నాం! అయ్యో!

ఇలాగే ఆలోచిస్తే తల పగిలిపోయేటట్లుంది. కానీ, ఎలాగైనా ఆ తెల్ల ఏనుగును తట్టి లేపాలి. అయినా, తను ఒక్కడే తెల్ల ఏనుగును ఢీ కొనగలడా? అది సాధ్యమేనా? అంతటి శక్తి తనలో ఉందా? తదుపరి పరిణామాల్ని తను తట్టుకొనగలడా?'

ఉదయ్ వళ్ళంతా ఒక్కసారిగా ఏదో తెలియని నిస్సత్తువ ఆవరించింది. నిస్సహాయత, నిరాశ, నిస్పృహ - ఏమీ చేయలేనితనం - ఇంతింతై ఉదయ్ అణువణువూ ఆవరించింది. ఎంత సేపు ఇలా ఉన్నాడో అతనికే తెలియదు.

సెల్ మోతతో లోకంలో పడ్డాడు.

వినీల. 'ఎక్కడికి వెళ్ళారు.. ఏమైపోయారు...' అంటూ.

ఆమె గొంతు వినగానే ఏదో శక్తి. అతనికి కడుపు నిండినట్లయింది. ఏమీ మాట్లాడకుండా ఆమె గొంతు వింటూనే ఉన్నాడు. ఇక మీతో మాట్లాడను పొమ్మంటూ ఆమె ఫోన్ పెట్టేసింది.

ఉదయ్ కారులోంచి దిగాడు. వినీల అలకల అందం మురిపెంగా తలుచుకొంటూ.

ఇంతలో, ఎక్కడి నుంచో ఒక చిన్న మూట విసురుగా వచ్చి ఉదయ్ కాళ్ళ దగ్గర పడింది. ఉదయ్ గెంతినంత పని చేశాడు. ఆదురుపాటుతో తలెత్తి చూశాడు.

పెంచలయ్య.

భయంతో విప్పారిన కళ్ళు. పాలిపోయిన ముఖం. ఇప్పుడు బరకగడ్డం తోడయ్యింది. బిత్తర చూపులు చూస్తూ... నిలబడి వున్నాడు. గోడ పక్కన మొక్కల వరుసలో.

''ఏంటిది పెంచలయ్యా?'' ఉదయ్ సౌమ్యంగా అడిగాడు.

పెంచలయ్య వంగి మూట విప్పాడు. చిల్లర బిళ్ళలు. గలగల మంటూ నేల మీద పడ్డాయి. సరిగ్గా ఉదయ్ పాదాల ముందు. చిందరవందరగా.

''అబ్బియ్య పాణం పోయను మాటలా? యతల పనిగదో! ఇంతసేపు మందల తెలీల. ఏవనుకో బాక. అంతా ఇచారిస్తానే వుళ్లా... మోటుకొనేది మోటుకొనేదే! మోటుకోనైతే? ఒక్కగానొక్క నలుసు. తట్టు కడుపున పెట్నా? నేనీడ్నే వుళ్లా? ఏవనుకోబాక. ఆ మయాన మా అబ్బియ్యను నీ చేతిల పెట్టిన్లా... ఇంగ నీకు నేనేంది జెప్పేది వైణాలు...!'' పెంచలయ్య ఒక్కసారిగా మాట్లాడడం మానేసాడు.

ఉదయ్ పై ప్రాణాలు పైనే పోయాయి. సిగ్గుతో చితికి పోయాడు. నిలువునా నీరయి పోయాడు. 'ఒక్కో రూపాయి బిళ్ళ ఆ పెంచలయ్య రక్తం. చెమట. పెంచలయ్య ఏమనుకొన్నాడో డబ్బు ఇవ్వకపోవడం వలన అతని బిడ్డను వదిలి రోజంతా బయట తిరుగుతున్నాననా?' ఉదయ్ తలలో ఆ రోజు కలిసిన ఒక్కో మనిషి... విన్న ఒక్కోమాట గిర్రున తిరిగాయి. నెమ్మదిగా వంగి, ఆ నాణేలన్నిటినీ మళ్ళీ మూటగట్టాడు. పెంచలయ్య వంక చూసి నవ్వాడు.

పెంచలయ్య చేసిన చిన్న పని ఉదయ్ గుండె లోతుల్ని తట్టింది. తట్టి లేపింది ఒక నిరాశలోంచి నిశ్చయంలోకి.

'ఎందుకు వంటరి పోరాటం చేయాలి అని అనుకున్నాడు తను. కానీ, అసలు ఎప్పుడు తను వంటరి వాడు? ఇది తన పోరాటం కాదు. పెంచలయ్యది. తన చేయి కలిపాడు. సాటి మనిషిగా. అంతే. ఏనుగు తెల్లదైతేనేం నల్లదైతేనేం- తట్టి లేపడానికి చిన్న అంకుశం ములుకు చాలదా?' ఉదయ్‌లో ఏదో తెలియని ఉత్సాహం నిండింది. చదువుల పరమార్థమెల్ల చదివిన సంతోషం కలిగింది.

ఆ మాటను పెంచలయ్య చేతిలో పెడుతూ - అతని చేయి నొక్కి వదిలాడు.

''పెంచలయ్యా - నువ్వు అన్నట్లుగా - ఎదుర్కొనేది ఎదుర్కొనేదే, ఏమైనా కానీ!''

పెంచలయ్యా నవ్వాడు చిగుళ్ళు కనబడేలా.

★

